

# అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

శుక్రవారం 12 డిసెంబర్ 2025 పేజీలు : 04


# అనంతలో అట్టహాసంగా సిపిఐ శత వార్షికోత్సవ ఉత్సవాలు

- అమరవీరుల కుటుంబాలకు సత్కారం - సభకు సిపిఐ జాతీయ రాష్ట్ర నేతలు రాక
- ప్రస్తుతం దేశం ప్రమాదంలో పడిందన్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా
- కమ్యూనిస్టులు పునరేకీకరణ కావాలని సిపిఐ నేత కే. రామకృష్ణ పిలుపు
- ఏపీలో చంద్రబాబు, జగన్ కు ప్రత్యామ్నాయం కోసం కృషి చేద్దాం అన్న గుజ్జుల ఈశ్వరయ్య






**అనంతపురం, డిసెంబర్ 11, (ప్రభాతవార్త బ్యూరో)**

దేశంలో, రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీల పునరేకీ కరణ ఎప్పుడు జరుగుతుందో తెలియదు గానీ గురువారం అనంతపురం లోని లలిత కళాపరిషత్తులో కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన అమరవీరుల కుటుంబాలు పెద్ద ఎత్తున కలుసుకున్నాయి. పూర్వ విద్యార్థుల సమ్మేళనం తరహాలో ఎన్నో ఏళ్లుగా అనంతపురం జిల్లాలోని సిపిఐ లో గ్రామస్థాయిలో, మండల స్థాయిలో పనిచేసి అమరులైన కుటుంబాల వారిని ఒక వేదిక పైకి చేర్చడంలో సిపిఐజిల్లా కమిటీసక్సెస్ అయ్యింది.. కార్యకర్తలు, నాయకులు, అమరవీరుల కుటుంబాల వారు కలుసుకునేందుకు అవకాశం వచ్చింది. సిపిఐ శత వార్షికోత్సవ వేడుకలు పేరుతో అమరవీరుల ఫోటోలు, ఇతర వివరాలు సేకరించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. అమరవీరుల ఫోటోలతో ఫ్లెక్సీలను కూడా సభా వేదిక ప్రాంగణంలో వేసింది. సన్మాన కార్యక్రమానికి పెద్దఎత్తునఅమరవీరుల కుటుంబాలు తరలి రావడంతో సన్మాన కార్యక్రమం, వారికిభోజన, మంచినీటిసదుపాయాలు తదితర వాటిలో కొంతఇబ్బందులుకూడా తలెత్తాయి. ఈ విషయంలో సిపిఐ నేతలు, కార్యకర్తలు, అమరవీరుల కుటుంబాలు కొద్ది శాతం మంది ఇబ్బంది కూడా పడ్డారు.. ఏది ఏమైనా సిపిఐ శత వార్షికోత్సవ సభ సఫలీకృతమైంది.. సభకు హాజరైన సిపిఐ అగ్ర నేతలు, జిల్లా నేతలు ప్రత్యేకంగా అమరవీరుల కుటుంబాలను, కార్యకర్తలు ఉద్దేశించి ప్రసంగించారు. వారి సభలో మాట్లాడుతూ.. భారతదేశంలో ప్రస్తుత పరిస్థితులు దేశానికి ప్రమాదంగా మారాయని, బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ లౌకిక పదాలను తొలగించి మత రాజ్యాంగంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఈ పరిస్థితుల్లో కేంద్రంలో బిజెపికి చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ ఎందుకు మద్దతిస్తున్నారని ప్రజలు ప్రశ్నించాల్సిన అవసరం ఉందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అభిప్రాయపడారు. శతాబ్ద ఉత్సవాలు జరుపుకుంటున్న కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు ఇదే స్ఫూర్తితో ఫాసిస్టు శక్తులను ప్రతిఘటించడానికి సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ శత వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా అనంతపురంలోని లలిత కళా పరిషత్ వేదికగా సిపిఐ జిల్లా కమిటీ నేతృత్వంలో గురువారం జరిగిన అమరవీరుల సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి అధ్యక్షత వహించగా అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్ జిల్లా సహాయ కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, జె.రాజారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ అనంతపురం ప్రాంతంతో తన అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. నీలం రాజశేఖర్ రెడ్డి జాతీయ కార్యదర్శిగా ఉన్న సమయంలో పార్టీ సిద్ధాంత కర్తగా తాను ఎన్నోసార్లు అనంతపురం సందర్శించానని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో అనేకమంది కమ్యూనిస్టు నాయకులు ప్రజాసంక్షేమం కోసం తమ వ్యక్తిగత జీవితాలను, ఆస్తులను అర్పించారని ఆయన స్మరించారు. భారతదేశం వలసరాజ్యంగా ఉన్నప్పుడు కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్ పార్టీ రెండూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన సందర్భాలను గుర్తుచేశారు. దేశ చరిత్రలోనే అతి చిన్న పార్లమెంట్‌గా ప్రస్తుతం నడుస్తున్న సభ ఉన్నప్పటికీ, పాలకులు వందేమాతరం వంటి విషయాలపై చర్చలు ముందుకు తెస్తున్నారని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ స్వేచ్ఛ, సమానత్వం విలువలను పీఠికలో పొందుపరచినా, మతవాదులతో ఎప్పుడూ రాజీపడలేదన్నారు. మోడీ ప్రభుత్వ విధానాలు దేశ కార్మికుల, కష్టజీవుల ప్రయోజనాలకు పనికిరావని, అవి అంబానీ-ఆదానీల ప్రయోజనాల కోసం మాత్రమే అమలు అవుతున్నాయని రాజా విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు ఆంధ్ర ప్రజలు వ్యతిరేకంగా నిలబడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. భారత కమ్యూనిస్టుల చరిత్ర త్యాగధనమయినదని, ఇటువంటి చరిత్ర కల కమ్యూనిస్టులు మతాధారిత ప్రభుత్వాల ఎదుట తప్పకుండా పోరాటం కొనసాగిస్తారని రాజా ప్రకటించారు. పేదలకు అండగా ఎర్రజెండా, స్వాతంత్రోద్యమంలో అలుపెరగని పోరాటాలు సలిపిన ఎర్రజెండా పేదవాడికి భూమి దక్కేవరకు ఉద్యమాన్ని కొనసాగించిందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో 4500 మంది అసువులు బాసి 10 లక్షల ఎకరాలు భూమిని పేదలకు పంచిన ఘనత సాధించిందన్నారు. రాయలసీమలో ముఖ్యంగా అనంతపురం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు నిర్బంధాలకు ఎదురొడ్డి భూస్వాముల చెరలో ఉన్న వేల ఎకరాల భూమిని పేదలకు పంచిదున్నేవాడికి భూమి నినాదాన్ని బలంగా తీసుకెళ్లారని చెప్పారు. ఐదుకల్లు సదాశివన్, నీలం రాజశేఖరరెడ్డి, తరిమెల నాగిరెడ్డి, వి.కె. ఆదినారాయణ రెడ్డి, గుత్తి రామకృష్ణ, బంగి రామప్ప, బంగి ఎర్రి స్వామి, పి ఎస్ శర్మ వంటి స్వాతంత్ర ఉద్యమ నాయకులు పేదల పక్షాన నిలబడి పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జవహర్లాల్ నెహ్రూ స్వాతంత్ర్య ఉద్యమ పోరాట ఫలితంగా 12 సంవత్సరాలు జైల్లో ఉంటే ఇటీవల ప్రధానమంత్రి మోదీ పార్లమెంటులో ఆయనను అవమానిస్తూ మాట్లాడటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం మిగతా 3 లో...






# ధర్మవరంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

- ముఖ్య అతిథులుగా హాజరైన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ మంత్రి సత్య కుమార్, ఎమ్మెల్యేలు
- సంస్కృతి సేవాసమితి సహకారంతో విద్యార్థిని విద్యార్థులకు 1098 సైకిళ్ళు పంపిణీ



ధర్మవరంలో మాజీ దేశ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి విగ్రహావిష్కరణ చేస్తున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, ఇతర నేతలు

**ధర్మవరం,డిసెంబర్ 11 ప్రభాతవార్త**

అటల్-మోదీ సుపరిపాలన బస్సు యాత్రలో భాగంగా దేశంలోనే పట్టు చీరల ఉత్పత్తికి ప్రసిద్ధిగాంచిన శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో మాజీ ప్రధానమంత్రి భారతరత్న దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఇతర బిజెపి, టిడిపి, జనసేన నాయకులు హాజరయ్యారు. ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సారథ్యంలో వాజ్‌పేయి శత జయంతోత్సవాలను పురస్కరించుకొని 11వ తేదీ నుంచి ఐదో తేదీ వరకు సుపరిపాలన యాత్రలు రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో రథయాత్ర చేపట్టారు. అందులో భాగంగా ఈ బస్సు యాత్ర ధర్మవరం పట్టణ నుంచే ప్రారంభించడమే కాకుండా మొదటిసారిగా వాజ్పేయి విగ్రహాన్ని ధర్మవరంలోని కాలేజీ సర్కిల్‌లో గురువారం అట్టహాసంగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఆవిష్కరింపజేయడం విశేషం. అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు మంత్రి సత్యకుమార్‌యాదవ్ సన్నిహితులు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, పుట్టపర్తి టిడిపి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మడకశిర టిడిపి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర నాయకులు మధుసూదన్ రెడ్డి తోపాటు పలువురు కూటమి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సందింటి శ్రీనివాసులు, చిరంజీవి రెడ్డి, లలిత్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ కుమార్తె సంస్కృతి స్వచ్ఛంద సంస్థ పేరుతో పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు 1098 సైకిళ్ళను ధర్మవరం హై స్కూల్ మైదానంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.



భూమి పత్రాలు పంపిణీ చేస్తున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, ఇతర నేతలు

# నలుగురు ఎస్సీ హాస్టల్ విద్యార్థినులు ఆత్మహత్యాయత్నం

- వార్డెన్ వసంత తిడుతున్నారని ఆరోపణ - ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినీలు
- నిలకడగా విద్యార్థినిల ఆరోగ్యం - ఘటనపై విచారణకు ఆదేశం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినీలను పరామర్శిస్తున్న సోషల్ వెల్ఫేర్ ఇంచార్జ్ డీడీ శ్రీనివాసరావు, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాము నాయక్

**అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 11 ప్రభాతవార్త**

వార్డెన్ తిడుతున్నారని నలుగురు విద్యార్థినీలు మనస్థాపం చెంది కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే..ముచ్చుకోట గ్రామానికి చెందిన విద్యార్థినీలు సౌజన్య, జాహ్నవి, లావణ్య, సౌమ్య అనంతపురంలో గిల్డప్ సర్వీస్ స్కూల్ పక్కన ఉన్న ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్ నెంబర్-1లో వసతి పొందుతూ కెఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు.అయితే వార్డెన్‌వసంత మమ్మల్ని ప్రతిరోజు పదే పదే తిడుతున్నారని, దీనివల్ల చాలా ఇబ్బంది పడుతున్నామని విద్యార్థినిలు ఆరోపిస్తున్నారు. దీనిని భరించలేక లోలోపలే ఆవేదన చదువుతున్నారు. ఈ బాధ భరించలేక చనిపోవాలని నిర్ణయించుకొని గురువారం ఉదయం హాస్టల్ నుండి కళాశాలకు వెళ్లారు. అక్కడ ఆ నలుగురు విద్యార్థినీలు సూపర్ వాస్మెల్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. వెంటనే సిబ్బంది గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నారు. ఎలాంటి ప్రాణ నష్టం లేదని వైద్యులు తెలిపారు.

**ఘటనపై విచారణకు ఆదేశం :**

నలుగురు విద్యార్థులు ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటనపై సాంఘికసంక్షేమశాఖ డైరెక్టర్, జిల్లాకలెక్టర్ వెంటనే స్పందించారు. వెంటనే ఆసుపత్రికి వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని, అలాగే దీనిపైన సమగ్ర విచారణ చేసి నివేదిక అందజేయాలని సోషల్ వెల్ఫేర్ ఇంచార్జి డీడీ శ్రీనివాసరావును ఆదేశించారు. వెంటనే డీడీ సోషల్ వెల్ఫేర్ మెడికల్ ఆఫీసర్‌తో కలిసి ఆసుపత్రికివెళ్లి విద్యార్థినీలను పరామర్శించారు. విద్యార్థినిల ఆరోగ్య పరిస్థితి బాగా ఉందని, ఎలాంటి ప్రాణ నష్టం లేదని వైద్యులు చెప్పినట్లు డీడీ డైరెక్టర్, జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. మరో మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో విద్యార్థులను ఉంచనున్నట్లు తెలిసింది. ఇన్‌చార్జ్ డీడీతో పాటు ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, అనంతపురం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాము నాయక్ కూడా విద్యార్థినీలను పరామర్శించారు. వార్డెన్ వసంత కూడా ఉదయం నుండి ఆసుపత్రిలోనే ఉంటూ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

**ఘటనపై సమగ్ర విచారణ చేస్తాం : సోషల్ వెల్ఫేర్ ఇంచార్జ్ డీడీ శ్రీనివాసరావు**

వార్డెన్ తిడుతున్నారని మనస్థాపం చెంది నలుగురు ఇంటర్మీడియట్ విద్యార్థినీలు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ఇందులో ఎవరికి ప్రాణహాని లేదు. అందరూ క్షేమంగా ఉన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి నివేదిక అందజేయాలని సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సమగ్ర విచారణ చేసి నివేదికను అందజేస్తాము.

# కళ్యాణదుర్గం పురపాలక సంఘం నూతన చైర్పర్సన్‌గా ఎన్నికైన తలారి గౌతమి

- ఎన్నికల అధికారి ఆర్డీఓ వసంత బాబు చేతులమీదుగా నూతన చైర్మన్ ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్న గౌతమి





మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఎమ్మెల్యే, ఎంపీ ,పురపాలక సంఘం నూతన చైర్మన్ గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నుండి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న నూతన చైర్మన్ తలారి గౌతమి

**కళ్యాణదుర్గం, డిసెంబర్11 ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం పురపాలక సంఘం నూతన చైర్ పర్సన్ గా 15వ వార్డుకు చెందిన తలారి గౌతమి ఎన్నికయ్యారు.డిసెంబర్4న కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో డిసెంబర్ 6న ఫారం2లో వార్డు సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులకు నోటీస్‌అందచేశారు. ఆమేరకు కళ్యాణదుర్గం పురపాలక సంఘం చైర్ పర్సన్ ఎన్నికను ఈనెల 11వ తేదీ గురువారం ఉదయం 11 గం. నుండి కళ్యాణదుర్గం మునిసిపల్ కౌన్సిల్ హాల్ నందు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో 22 మంది కౌన్సిలర్లు, 2 ఎక్స్ అఫిషియో సభ్యులు పాల్గొనగా, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా శ్రీమతి టి. గౌతమి వార్డు నంబర్ 15 కి మద్దతుగా 13 మంది చేతులు ఎత్తి తమ మద్దతు తెలుపారు. వైఎస్ఆర్సీ పార్టీ అభ్యర్థి ఎం.లక్ష్మన్న 14వ వార్డు అభ్యర్థికి 11 మంది చేతులు ఎత్తి మద్దతు పలుకగా, మెజారిటీ సాధించిన టీడీపీ అభ్యర్థి శ్రీమతి టి. గౌతమి విజయం సాధించినట్లు ఆర్డీవో, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వసంత బాబు విజేతగా ప్రకటించారు. ఇద్దరు కౌన్సిలర్లు ప్రత్యేక సమావేశానికి గైర్హాజరయ్యారు. అనంతరం చైర్ పర్సన్ గా ఎన్నిక కాబడిన శ్రీమతి టి.గౌతమి ధృవీకరణ పత్రాన్ని ప్రిసైడింగ్ అధికారి అందించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, ఎంఎల్ఏ అమిలినేని సురేంద్ర బాబు ఎక్స్ అఫిషియో సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎలక్షన్ అథారిటీ, మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి సహకరించిన కౌన్సిలర్లలందరికి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, పోలీస్ యంత్రాంగానికి, మున్సిపల్ సిబ్బందికి,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఆర్డీఓ, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి కృతజ్ఞతలు తెలిపారు.

# కళ్యాణదుర్గం మున్సిపాలిటీని అభివృద్ధి చేయడమే లక్ష్యం

## అభివృద్ధి కోసం అండగా నిలిచిన మున్సిపల్ కౌన్సిలర్లు





చైర్మన్ ఎన్నిక తర్వాత పాలకవర్గంతో ఎమ్మెల్యే సురేంద్రబాబు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

**కళ్యాణదుర్గం, డిసెంబర్ 11 ప్రభాతవార్త :**

గత వైసిపి పాలకవర్గంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోని కళ్యాణ్ దుర్గం మున్సిపాలిటీని అభివృద్ధి చేయడానికి కృషి చేయడంలో భాగంగానే కౌన్సిలర్ల అండదండలతో నూతన చైర్మన్ పదవి తెలుగుదేశం,కూటమి ప్రభుత్వం దక్కించుకుందని ఎమ్మెల్యే సురేంద్రబాబు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం పురపాలక సంఘం నూతన చైర్మన్ ఎన్నిక అనంతరం మీడియాతో మాట్లాడుతూ కళ్యాణదుర్గం చుట్టుపక్కల ఉన్న రాయదుర్గం ఉరవకొండ మడకశిర మున్సిపాలిటీలలో అభివృద్ధి జరుగుతుంటే కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో మాత్రం అభివృద్ధిలో వెనుకబడుతనం ఉందని అన్నారు. అందుకే కళ్యాణదుర్గం పట్టణాన్ని అభివృద్ధి కార్యక్రమాలతో పట్టణ సుందరీకరణ చేయడానికి ఒక ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కళ్యాణ్ దుర్గం నూతన చైర్పర్సన్ గా వాల్మీకి సోమాజిక వర్గానికి చెందిన తలారి గౌతమి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అభివృద్ధికి బాటోలు వేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే కళ్యాణదుర్గం పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను వ్యవస్థీకరించేందుకు టీ సర్కిల్ సమీపంలో డ్రైనేజీ సంపును నిర్మించినట్లు తెలిపారు. అలాగే కనకరాజు సర్కిల్ నుండి టీ సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టి రహదారుల నిర్మాణాలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేస్తుంటే, కళ్యాణదుర్గంలో అభివృద్ధి అజెండాతో సురేంద్రబాబు కృషి చేస్తున్నట్లు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కితాబిచ్చారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు నాయకత్వంలో కళ్యాణదుర్గం మునిసిపాలిటీ పరిధిలోని పట్టణాన్ని అభివృద్ధి చేయడంలో కృషి చేస్తానని పేర్కొన్నారు. తన విజయానికి సహకరించిన కౌన్సిలర్లకు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ పార్టీకి అచ్చొచ్చిన నెంబర్ 11: చమత్కరించిన ఎమ్మెల్యే11 అనేది వైసిపి పార్టీకి అచొచ్చిన నంబరని, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 11 స్థానాలు గెలుచుకుందని, కళ్యాణదుర్గంలో కూడా 11 నంబర్ అచ్చొచ్చినట్లు ఉందని, కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నికను ఈనెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తే ఇరువైపులా 11 మంది కౌన్సిలర్లు ఎన్నికల్లో పాల్గొన్నారని, వైసీపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు గైర్హాజర్ కావడంతో ఎక్స్ అఫీషియో ఓట్లతో విజయం సాధించడం 11 నంబర్ విశిష్టతగా చమత్కరించారు.

# అనంత మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా కళ్యాణదుర్గం ఆడబిడ్డ బల్లా పల్లవి

## ఫలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రయత్నాలు



**అనంతపురం, డిసెంబర్ 11, (ప్రభాతవార్త బ్యూరో)**

అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ గా బల్ల పల్లవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. మార్కెట్ యార్డు చైర్మన్ తోపాటు కమిటీ సభ్యులందరినీ నియమిస్తూ ఉత్తర్వులుజారీచేసినట్లు సమాచారం.. బల్ల పల్లవి నియామకంతో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రయత్నాలు ఫలించిన ట్లు అయింది. మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి కోసం చాలా నెలలుగా వల్ల పల్లవి పేరు నానుతూ వచ్చింది.. బల్లాపల్లవికి రాకుండా నేతలు గట్టి ప్రయత్నాలు చేశారు. పార్టీ అధిష్టాన వర్గానికి ఫిర్యాదులు కూడా చేశారు.. ఎట్టికేళ్లకు బల్లాపల్లవి చైర్మన్ పదవి దక్కడం విశేషం..

02ATP27_02ATP27.qxd 11-12-2025 PM 10:28 Page 1



## పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి, స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు ఆదర్శనీయం



ఆత్మీయ అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

బెలుగుప్ప, డిసెంబర్ 11 ప్రభాతవార్త

ప్రాథమికోన్నత పాఠశాల కోనంపల్లి గ్రామం బెళుగుప్ప మండలంలో రూ.1,50,000/ వ్యయంతో పాఠశాల ఆవరణంలో రేకుల షెడ్డు నిర్మించిన దాతలు ఎ.జి.ప్రమీలమ్మ అనంతపురం వారిని, గూడూరు నరసింహులు వారి కుమారులు హరిక్రిష్ణ, శరత్ పూర్వ విద్యార్థులు కోనంపల్లి గార్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ నాయక్ అధ్యక్షతన, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో ఆత్మీయ అభినందన సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ పెద్దన్న ముఖ్య అతిథిగా విచ్చేశారు. దాతల ఔదార్యము, దాతృత్వం సేవాభావం గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పేరెంట్స్ కమిటీ సభ్యులు కొనియాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, పాఠశాల ఉపాధ్యాయ బృందం, కమిటీ చైర్మన్ వన్నూరు స్వామి, వైస్ చైర్మన్ బాలకృష్ణ, గ్రామ పెద్దలు గోవిందరాజులు, యుగంధర్, భాస్కర్, శరత్, ఎర్రిస్వామి, సురేష్, మారెప్ప, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ షురూ

కళ్యాణదుర్గం రూరల్ డిసెంబర్ 11 ప్రభాతవార్త



వీధి కుక్కలను తరలిస్తున్న ప్రత్యేక బృందం

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ టి ఆర్ కాలనీ, ఎస్సీ కాలనీ నందు గురువారం వీధి కుక్కలకు వ్యాక్సిన్ లను వేయించడానికి ప్రత్యేక బృందం పని ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వీధి కుక్కలను అనంతపురం వెటర్నటీ ఆసుపత్రి కి తరలించి పుర వీధులలో కుక్కల బెడద ను అరికట్టడానికి కృషి చేస్తున్నామని, పట్టిన కుక్కలను అనంతపురం వెటర్నటీ ఆసుపత్రి కి తరలించి వాటికి ఏ ఆర్ వి వ్యాక్సిన్ లు వేసి సురక్షిత ప్రదేశాలలో వదులుతారని తెలియజేశారు. ఈ ప్రక్రియ ఇంకా మూడు నెలల పాటు జరుగుతుందని, వీధులలో కుక్కల బెడద ఉన్నవారు దగ్గరలో ఉన్న వార్డు సచివాలయం లోని వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీ లకు తెలియజేయాలని కమిషనర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## లైవ్ స్టాక్స్ లోన్లపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న పశు వైద్యాధికారి

బ్రహ్మసముద్రం డిసెంబర్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని శ్రీ శక్తి భవన్లో గురువారం మండల వ్యాప్తంగా ఉన్న ఆనిమేటర్స్ సీసీలతో సమీక్షా సమావేశం ఏటీఎం వీరనారప్ప. పశు వైద్యాధికారి నాగబాబు సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో పశువైద్యాధికారి మాట్లాడుతూ ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు మహిళా సంఘాలలో లోన్ల కోసం జరిగిన సర్వేలో మహిళా సంఘాలలో తీసుకున్న లోన్లు వాటికి సంబంధించి యూనిట్లకు పశువులు ఆవులు గొర్రెలు తదితరుల దానిపై తీసుకున్న మహిళా సంఘాల లోన్లను వారు తీసుకున్న యూనిట్లకు ఇన్సూరెన్స్ చేయించాలని వారు తీసుకున్న పశువులకగానే ఇతర యాత్ర వాటికి ప్రమాదం జరిగితే లోన్లు తీసుకున్న మహిళలు తిరిగి కట్టడానికి ఇబ్బంది పడకుండా వారు తీసుకొన యూనిట్ పై ఇన్సూరెన్స్ వర్తింపజేసి సంఘాలు బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేసినట్లు అవుతుందని వివరించారు.

## బస్సు చక్రాల కింద పడి వ్యక్తి దుర్మరణం

రాయదుర్గం రూరల్ డిసెంబర్ 11 ప్రభాతవార్త



ప్రమాదంలో మృతి చెందిన ఈశ్వరప్ప

మండల పరిధిలో ని రాయదుర్గం కనేకల్ ఆర్ అండ్ బి ప్రధాన రహదారిలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈశ్వర ప్ప 40 సంవత్స రాలు దుర్మరణం పాలయ్యాడు. స్థానికుల తెలిపిన వివరాలు మేరకు టీ వీరాపురం గ్రామానికి చెందిన మేకల కాపరి ఈశ్వరప్ప ద్విచక్ర వాహనంలో రాయదుర్గం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా టీ వీరాపురం గ్రామ సమీపంలో రాయదుర్గం నుండి ఉరవకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్ టైక్ చేయబోయి అదుపుతప్పి కిందకు పడడంతో బస్సు చక్రాలు తల మీద వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికిభార్య తో పాటు ఐదు మంది కూతుళ్లు ఒక కొడుకు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అర్బన్ సీఐ జయ నాయక్ సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ ని క్లియర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణకు భారీ సంఖ్యలో తరలిరండి

### బిజెపి మండల అధ్యక్షుడు కురబ తిప్పేస్వామి

కనేకల్, డిసెంబర్ 11 (ప్రభాతవార్త):

మాజీ ప్రధాని, భారతరత్న, అజాతశత్రువు శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలంతా భారీ ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు కురబ తిప్పేస్వామి పిలుపునిచ్చారు. ఈ నెల శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు అనంతపురం గుత్తి రోడ్డులో వాజ్‌పేయి విగ్రహావిష్కరణను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగనున్నట్లు తిప్పేస్వామి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కూటమి పార్టీలైన టిడిపి, జనసేన పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని తెలిపారు. వాజ్‌పేయి వంటి మహనేత విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రతి కార్యకర్త, అభిమాని, ప్రజలు తప్పకుండా హాజరై ఘన విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా బిజెపి మండలఉపాధ్యక్షుడు బ్రహ్మసముద్రం కురబ నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్ యాదవ్, నాయకులు కొత్త వన్నూరుస్వామి యాదవు, ప్రజలందరినీ ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు.

## నరసింహులు హ్యాట్రిక్ విజయాలు

### ఏకగ్రీవంగా ఏపీ ఎన్.జి.జి.ఓ. ఎన్నికలు

హిందూపురం డిసెంబర్ 11 ప్రభాతవార్త



నరసింహులును అభినందిస్తున్న నాయకులు

ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హిందూపురం తాలూకా అధ్యక్షులుగా బి.నరసింహులు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని ఎన్.జి.జి.ఒ. హోం లో గురువారం ఎన్నికల ప్రక్రియ జరిగింది. ఉదయం 10.00 గంటల నుంచి 01.30 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. ఎలక్షన్ ఆఫీసర్‌గా జిల్లా కన్వీనర్ పి.శంకర్ నారాయణ



నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

వ్యవహరించారు. అన్ని నామినేషన్లు పరిశీలించిన అనంతరం, ప్రతి పదవికి ఒక్కో నామినేషన్ మాత్రమే రావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిసినట్లు ఎలక్షన్ ఆఫీసర్ ప్రకటించారు. ఎన్నికైన కొత్త కార్యవర్గం వీరే.. ఇప్పటికే రెండు మార్లు అసోసియేషన్ అధ్యక్షులుగా ఉన్న బి.నరసింహులు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. అసోసియేట్ ప్రెసిడెంట్ జి.జగదీష్, ఉపాధ్యక్షులు గా ఎన్. శివన్న, గంగాధర్, సుబ్రహ్మణ్యం, చైతన్య కుమార్, రాజేష్, ప్రమీల, కార్యదర్శిగా కే.వేణుగోపాల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎస్.దాదా ఖలందర్ వలి, సహాయ కార్యదర్శులుగా వెంకట్ రెడ్డి, సచివాలయం లేపాక్షి, అశ్వతప్ప సచివాలయం హిందూపురం మున్సిపాలిటీ, ,యాసీన్, సిరికల్చర్ డిపార్ట్మెంట్, శివరాం సచివాలయం పరిగి మండల్, మహిళా విభాగం జాయింట్ సెక్రెటరీ గా భారతి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ట్రెజరర్ గా జె.సుదర్శన్ బాబు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మాధవ, శ్రీ సత్యసాయి జిల్లా చైర్మన్ లింగ రామ్మోహన్ శుభాకాంక్షలు తెలుపుతూ సంఘం అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు.

## మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు విరాళం

డి.హిరెహాళ్ డిసెంబరు 11 ప్రభాతవార్త



విరాళం అందజేస్తున్న బిజెపి నాయకుడు వన్నూరుస్వామి

బిజెపి నాయకుడు, ఎంపీపీ సలహాదారులు బోయ వనూరుస్వామి మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు విరాళం అందజేశారు. గురువారం డి.హిరెహాళ్ మండలం హెచ్.సిద్దాపురం గ్రామంలోని తన స్వగృహంలో రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి ఉప కార్యదర్శి నాగలాపురం నారాయణస్వామి, వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సభ్యులు రామాంజనేయులు తదితరులకు ఆయన విరాళం వితరణ చేశారు. మండలపరిధిలోని దొడగట్టగ్రామంలో మహర్షివిగ్రహం ప్రతిష్టించాలన్న సంకల్పంతో కమిటీసభ్యులు ఆయనను కలుసుకొనిసమాచారం తెలియపరచి ఈమహత్ కార్యక్రమానికి తమవంతు సహాయ,సహకారాలు అందించాలని కమిటీ సభ్యులుకోరారు. అందుకు అంగీకరించిన ఆయన విగ్రహ ప్రతిష్టాపనకు తన వంతు సహాయంగా రూ. 15000 లు విరాళామందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. విరాళం అందుకున్న కమిటీ సభ్యులు మాట్లాడుతూ అడిగిన తక్షణం రాజకీయాల కతీతంగా తమ వంతు సహాయంగా విగ్రహ ప్రతిష్టాపనకు విరాళాల అందించడం ఆనందదాయకమని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాసులు, జటంగి తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రప్పా... ఈ విచిత్రం ఎందబ్బా!!

### -సీసీ రోడ్డును నాసిరకంగా వేయటానికి ప్రయత్నిస్తున్న కాంట్రాక్టును అడ్డుకున్న గ్రామస్థులు -ఉన్నతాధికారులకు తెలుపకుండా సీసీ రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు

శెట్టూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త



సీసీ రోడ్డు వేయాల్సిన ప్రదేశంలో ఎర్రఇసుకను సిద్ధం చేసిన దృశ్యం

ప్రభుత్వం ఇటీవలే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి పనులను కొన్ని గ్రామాలకు మంజూరు చేసినది విదితమే అయితే సీసీ రోడ్డు పనులును మండల పరిధి లోని అన్నుపల్లి గ్రామంలో కాంట్రాక్టర్ వీరభద్రప్ప గురువారం ఆగ్రామనికి వెళ్లి పనుల ప్రారంభానికి సన్నాహాలు చేయడంలో భాగంగా సీసీ రోడ్డు వేయాల్సిన ప్రాంతంలోనికి ట్రాక్టర్ ద్వారా ఇసుకను సిద్ధం చేశారు. దీనిని గమనించిన గ్రామస్థులు ఆ ప్రదేశం వద్దకు వెళ్లి సిద్ధం చేసిన ఇసుకను పరిశీలించగా మొత్తం ఎర్రమట్టిని పోలిన ఇసుకలా ఉండటంతో గ్రామస్థులు ఆ కాంట్రాక్టర్ ను అడ్డగించారు. ప్రభుత్వం మా గ్రామానికి ఎంపీపీ నిధుల ద్వారా నాణ్యమైన సీసీ రోడ్లను 4లక్షలు వ్యయం తోమంజురు చేయగా నాసిరకంగా పనులుచేసి ప్రభుత్వ సొమ్మును దోచుకొందామనిచూస్తే మేముచూస్తూ ఉండలేమని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని నాణ్యమైన సీసీ రోడ్డును నిర్మించాలని వారు కోరారు.:ఈ విషయంపై మండల ఇంజనీర్ నరేష్ ను వివరణ కోరగా....అన్నుపల్లి గ్రామానికి 4లక్షల వ్యయంతో సీసీరోడ్లు మంజూరైనది వాస్తవమేనని ఎటువంటి సమాచారం కాంట్రాక్టర్ వీరభద్రప్ప మాకు తెలుపలేదని నాసిరకంగా నిర్మాణ పనులు చేపడితే బిల్లులు మంజూరు చేసేది లేదని ఇంజనీర్ నరేష్ తెలిపారు.

## సాఫీగా మండల సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కంబదూరు, డిసెంబర్ 11, ప్రభాతవార్త

కంబదూరు మండల ప్రజా పరిషత్ సమావేశపు భవనంలో గురువారం ఎంపీపీ లక్ష్మీదేవి, డిప్యూటీ ఎంపీడీవో అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాఫీగా జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం అధికారులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాలకిషన్, అడ్మినిస్ట్రేషన్ అధికారి తిప్పయ్య, వైస్ ఎంపీపీ సోమశేఖర్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## సీనియర్ అడ్మినిస్ట్రేషన్ గ్రేడ్ పదోన్నతి పొందిన.. బాల మురళీధర్

### కరోనా సమయంలో గుంతకల్లుకు సేవలందించిన అధికారి..

గుంతకల్ రైల్వే, డిసెంబర్ 11 ప్రభాత వార్త



మిషన్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ పదవి పొందిన బాల మురళీధర్

గుంతకల్ రైల్వే డివిజన్ ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీస్ అధికారి రైల్వేలలో సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ సాధించారు. బాల మురళీధర్ రైల్వేలలో ప్రమోషన్లలో ప్రతిష్టాత్మక పదవికి ఒక మెట్టు, ఇది సంస్థలో ప్రతిభావంతులైన వ్యక్తులకు అందుబాటులో ఉన్న అవకాశాలను ప్రదర్శిస్తుంది. భారతీయ రైల్వే పర్సనల్ సర్వీస్ అధికారి ఎం బి మురళీధర్, భారతీయ రైల్వేలలో సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్‌కు పదోన్నతి పొందారు. రైల్వే లో అంకితభావం మరియు కృషి ద్వారా తన ర్యాంకులను పెంచుకున్నారు. 2000లో గ్రూప్ బి అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు మరియు తరువాత డిపిఓ/ సీనియర్ డిపిఓ / డిప్యూటీ సిపిగా . సిపిఓ మరియు గుంతకల్ డివిజన్‌లో సీనియర్ డిపిఓగా పదోన్నతి పొందారు. మరియు 2019 నుండి ,2022, వరకు గుంతకల్ రైల్వే డివిజన్లో సీనియర్ డిపిఓగా పనిచేశారు. కోవిడ్ సమయంలో రైల్వే ఉద్యోగస్తులకు సహాయ సహకార అందిస్తూ కోవిడ్ లో గుంతకల్ ప్రజలకు రైల్వే ఉద్యోగస్తులకు ఎనలేని సేవలు అందించారు. 2023 లో వరుసగా ఎన్నో పతకాలు పొందారు. తిరిగి 2025లో సీనియర్ డిపిఓ ఇన్చార్జిగా నియమితులయ్యారు. అద్భుతమైన విజయం ఆయన నిబద్ధత మరియు సేవలో అత్యుత్తమ ప్రతిభకు నిదర్శనం. అడ్మినిస్ట్రేట్ గ్రేడ్ బాల మురళీధర్ కు ఉద్యోగస్తులు స్నేహితులు అభినందనలు తెలిపారు.

## మండలంలో సోలార్ పార్క్ ఏర్పాటు చేయడం హర్షణీయం

### సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప



సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప

గుడిబండ డిసెంబర్ 11 ప్రభాతవార్త

మండలంలో సోలార్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, తెదేపా మండల అధ్యక్షులు లక్ష్మీనరసప్ప, హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేసిన ఎంఎల్ఏ ఎంఎస్ రాజు, మాజీ ఎంఎల్సీ గుండుమల తిప్పేస్వామి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. మండల పరిధిలోని చిగతుర్పి,కరికెర, జంబలబండ గ్రామాలలో వర్షాధార భూములలో సోలార్ పార్క్ ఏర్పాటు చేయడం హర్షణీయమని రైతులు వర్షం పై ఆధారపడి పంటలు పండక, దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్న తరుణంలో సోలార్ పార్క్ ఏర్పాటు చేయడం వల్ల రైతులకు స్థిరమైన ఆదాయం వస్తుందని, దీని వల్ల రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని తెలిపారు.

## భారీ ఎత్తున ధర్మవరంకు బయలుదేరిన గోరంట్ల బిజెపి నాయకులు

### - బిజెపి మండల కన్వీనర్ బోయ లక్ష్మినారాయణ అధ్వర్యంలో వాహనాల్లో పయనం



ధర్మవరంకు పయనమైన బిజెపి శ్రేణులు

గోరంట్ల, డిసెంబర్ 11 ప్రభాతవార్త

ధర్మవరంలో జరుగుతున్న అటల్ - మోదీ సుపరిపాలన భారత మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్‌శేఖర్ నాయకత్వంలో మండల బిజెపి అధ్యక్షులు బోయ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బిజెపి నాయకులు పయనమయ్యారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొనే కార్యక్రమంలో రాష్ట్ర రథసారథి పివిఎన్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతి శ్రీనివాస్‌వర్మ, ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అధ్యక్షతన జరుగుతున్న ఈ కార్యక్రమానికి గోరంట్ల మండలం నుండి భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు 12 వాహనాల్లో ధర్మవరంకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో వడల చంద్రారెడ్డి, భజంత్రీ శంకర, పూల గంగాధర్, శంకర్‌రెడ్డి, వెంకటాచలం, హరీష్, నాగరాజ్‌యాదవ్, కుర్ర ఆంజనేయులు, జెకె జగన్, కాటేపల్లి అశ్వర్థ, పూలేరు సూరి, బాలకృష్ణ, నగేష్, అశోక్, లక్ష్మీనరసింహ, గుంటిపల్లి చంద్ర, జయరాంనాయక్, రామాంజినమ్మ, లక్ష్మీదేవి, ముంతాజమ్మ, పార్వతిబాయి, శాంతమ్మ, అలివేలి, తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## పీఏబీఆర్ నుండి దిగువకు నీటి విడుదల నిలిపివేత..!

### -స్పిల్‌వే గేట్లన్నింటినీ మూసివేసిన అధికారులు

ఉరవకొండ, డిసెంబరు 11 ప్రభాతవార్త



పీఏబీఆర్ స్పిల్‌వే గేట్లను మూసివేసిన దృశ్యం

డా॥కె.ఎస్. పెన్న హోబిళం బ్యాలన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) నుండి దిగువకు నీటి విడుదలను గురువారం అధికారులు పూర్తిగా నిలిపివేశారు. డ్యాం లోకి కేవలం 220 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో స్పిల్‌వే గేట్లను మూసివేశారు. డ్యాం పూర్తి నీటి నిలువ సామర్థ్యం 11.000 టీఎంసీలు (443 మీటర్లు) కాగా ప్రస్తుతం డ్యాంలో 5.185 టీఎంసీలు (435.450 మీటర్లు) నీరు నిలువ ఉందని డ్యాం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎం.వెంకటరమణ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ముత్యాలప్ప, గంగమ్మ, లక్ష్మిదేవి, రేణుక తెలిపారు. గురువారం నాటికి డ్యాంలోకి 220 క్యూసెక్కుల నీరు వస్తుండగా హెచ్ఎల్సీ ద్వారా 120 క్యూసెక్కులు, హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 100 క్యూసెక్కులు ఉందన్నారు. అవుట్ ఫ్లో 340 క్యూసెక్కులు ఉండగా ఎంపీఆర్‌కు 150 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తికి 110 క్యూసెక్కులు, తాగునీటికై 55 క్యూసెక్కులు, ఎవాబిరేటింగ్, గ్యాలరీ ద్వారా 25 క్యూసెక్కులు వెళుతోందని వివరించారు.

## రేపు సాధారణ సర్వసభ్య సమావేశం



ఎంపిడిఓ కేశవరెడ్డి

గుడిబండ డిసెంబర్ 11 ప్రభాతవార్త

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రేపు శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ కేశవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సాధారణ సర్వసభ్య సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని, అలాగే అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

## ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

### -ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుత్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త



కాలువలకు నీటిని విడుదలచేస్తున్న ఎమ్మెల్యే

నియోజకవర్గంలోని రైతాంగం సంక్షేమ దృష్ట్యా ప్రతిఎకరాకు సాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్పష్టం చేశారు. గురువారం మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న చంద్రాయుని గుంట రిజర్వాయర్ నుండి చెరువులకు, కుంటలకు సాగునీటిని కాలువల ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికెబి రిజర్వాయర్ ద్వారా పుల్లేటి ఎర్రగుడి, అయ్యవారిపల్లి, పూలకుంటతో పాటుగా చిన్న చిన్న కుంటలకు నీరు అందుతుందన్నారు. సదరు గ్రామాల రైతులు నీటిని వాడుకుని సక్రమంగా పంటలు పండించుకోవాలని ఆయన సూచించారు. అంతకు మునుపు ఆయన గంగమ్మ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, సాగునీటి సంఘం అధ్యక్షులు రామకృష్ణ, అప్పా రామకృష్ణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా, రమేష్, మండల కన్వీనర్ లక్ష్మీరంగయ్య, బద్రివలి, మాజీ సర్పంచులు నారాయణస్వామి, నరసింహులు, తిమ్మప్ప, సంబంధిత అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## విశాఖపట్నంలో భారీ బహిరంగ సభ పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

బెలుగుప్ప, డిసెంబర్ 11 ప్రభాతవార్త

2025 డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు ఆల్‌ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని బెలుగుప్ప మండలంలో వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది. 2026 జనవరి 4వ తేదీ విశాఖపట్నంలో భారీ బహిరంగ సభ జరుగుతోంది. ఈ బహిరంగ సభలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం స్కీముల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులు హమాలీలకు సమగ్ర చట్టం చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగసంస్థల ప్రైవేటీకరణనుఆపాలని తదితర అంశాలపై ఈ మహాసభల్లో చర్చ జరిపి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుంది. 2026 జనవరి 4వ తేదీ జరిగే భారీ బహిరంగ సభలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలి. ఈ కార్యక్రమంలో ఎం నాగమణి, సిఐటియు జిల్లా కోశాధికారి, సిఐటియు మండల నాయకులు సుజాత, భీమన్న, వన్నూరు స్వామి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## రేబిస్ వ్యాధితో యువకుడు మృతి

చిలమత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త



సాయినాథ్ (ఫైల్‌ఫోటో)

చిలమత్తూరు మండల పరిధిలోని దేమకేతేపల్లికి చెందిన సాయినాథ్ (23) అనే యువకుడు రెబిస్ వ్యాధితో బెంగళూరు ఆసుపత్రిలో మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఇంటిలో ఉన్న పెంపుడు కుక్కకు మరో కుక్క కరవడం, ఆ తరువాత పెంపుడు కుక్క సాయినాథ్‌ను కరవడంతో యువకుడు మృతి చెందినట్లు సమాచారం. బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయినాథ్ మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటన స్థానికులను సైతం కంటతడి పెట్టించింది. మహారాష్ట్రలో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ కుటుంబ బాధ్యతలను చూసుకుంటూ తల్లితండ్రులుకు అండగా నిలిచిన యువకుడి మరణం వారి కుటుంబసభ్యులు, స్నేహితుల్లో విషాదాన్ని నింపింది. మృతునికి ఒక అన్న ఉన్నాడు.

## అదుపుతప్పి కంటైనర్ బోల్తా

చిలమత్తూరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త



అదుపుతప్పి బోల్తాపడిన లారీ

చిలమత్తూరు మండలంలోని 44వ జాతీయ రహదారిపై గురువారం హైదరాబాద్ నుండి బెంగళూరుకు బైకులు తరలిస్తున్న ఒక కంటైనర్ అదుపుతప్పి బోల్తాపడింది. నిద్రమత్తులో వున్న డ్రైవర్ డివైడర్‌ను ఢీ కొట్టడంతో దాదాపు 300 అడుగుల దూరం డివైడర్‌ను ఆనుకుంటూ కంటైనర్ వెళుతున్న తీరును చూసి మేలుకున్న డ్రైవర్ వాహనాన్ని పక్కకు తిప్పే క్రమంలో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనకు నిద్రమత్తు కారణమైందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో వెనుక ముందు వైపు వాహనాలు ఏవి రాకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాయదుర్గం రూరల్ డిసెంబర్ 11 ప్రభాతవార్త



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

రాయదుర్గం రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు నిన్న రాత్రి సమయంలో అటుగా వాకింగ్ వెళ్తున్న కొందరు రోడ్డు పక్కన పడి ఉన్న ఈ వ్యక్తిని గుర్తించి దగ్గరలో సేవా భారత్ ట్రస్ట్ గంగాధర్ గారికి సమాచారం ఇవ్వగా ,సంఘటన స్థలానికి వచ్చిన ట్రస్ట్ సభ్యుడు గంగాధర్ అనాథ వ్యక్తిని పరిశీలించి ఆయన అనంతపురం నగరం నాయక్ నగర్ కాలనీ వాసి, పేరు మల్లికార్జున అనే విషయాలను రాబట్టారు. వెంటనే ఈ వ్యక్తికి ఆహారం తినిపించటానికి ప్రయత్నించారు కానీ అతను ఆహారం తీసుకోలేని పరిస్థితిలో ఉన్నాడని గ్రహించారు. ఉదయాన్నే ఇతనికి స్నానం చేయించి ఆసుపత్రికి తీసుకు వెళ్లాలని ప్రయత్నించగా అప్పటికే అతను ప్రాణాలను విడిచాడు. ఇతని పరిస్థితి చూసి దిగ్భ్రాంతికి గురి అయినా స్థానికులు వెంటనే పోలీసు వారికి సమాచారం ఇవ్వగా , మున్సిపాలిటీ వాహనంలో సేవా భారత్ ట్రస్ట్ గంగాధర్ మరియు స్థానికులు పోలీసుల ఆదర్యంలో స్మశానానికి తీసుకువెళ్లి హిందూ ఆచారంలో అనాథ మృతదేహానికి స్నానం చేయించి ఖననం చేశారు.

## పంచాయతీని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికులదే కీలకపాత్ర - గ్రామ సర్పంచ్,ఇన్చార్జ్ కార్యదర్శి

అనంతపురం రూరల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:


పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

అనంత రూరల్ మండలం రాచా నపల్లి పంచాయతీని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికులదే కీలకపాత్రని పంచాయతీలో సర్వేలు ఎటువంటి పెండింగ్ లేకుండా సకాలంలో సచి వాలయ ఉద్యోగులు పూర్తిచేయాలని, అదేవిధంగా పంచాయతీలో ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి గ్రా మాన్ని పరిశుభ్ర గ్రామంగా ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్మికులకు గ్రామ సర్పంచ్ ఆంజనేయులు యాదవ్, ఇన్చార్జ్ పంచాయితీ కార్యదర్శి సర్దా ర్ వలి తెలిపారు. రాచా నపల్లి పంచా యితీ ఇన్చార్జ్ కార్యదర్శిగా పి.సర్దార్ వలి ని ఎంపిడిఓ దివాకర్ నియమిస్తూ మంగ ళవారం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన ఉత్తర్వుల మేరకు గురువారం పి.సర్దార్ వలి ఇన్చార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం వారు సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులతో సమా వేశమై గ్రామంలో ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు ఏవే గాని పెండింగ్ ఉండకుండా సకాలంలో పూర్తి చేయాలని సచివాలయ సిబ్బ ందికి తెలియ జేశారు. అదేవిధంగా గ్రా మంలో ఎక్కడే గాని చెత్త నిలువ ఉండకుండా ప్రతి రోజు గ్రామంలో నివసించే ప్రజల ఇంటి వద్దకు వెళ్లి వారి నుంచి తడి పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి సేకరించిన చెత్తను చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రానికి తరలించి గ్రామా న్ని పరిశుభ్ర గ్రామంగా ఉంచాలని పంచాయతీ కార్మి కు లకు గ్రామ సర్పంచ్ ఆంజనేయులు యాదవ్, కార్యదర్శి సర్దార్ వలి తెలి పారు. అనంతరం ఆయన గ్రామంలోని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రానికి వెళ్లి గ్రామ ప్రజల నుంచి సేకరించిన తడి పొడి చెత్తను ఏ విధంగా నిలువ ఉంచుతున్నారని దానిపై పంచాయతీ కార్మికులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## బి పి ఎస్, ఎల్ఆర్ఎస్ ల పై వివరాలు సేకరించి నివేదిక అందించాలి పంచాయతీ కార్యదర్శులకు తెలిపిన ఎంపీడీవో,డిప్యూటీ ఎంపీడీవో.

అనంతపురం రూరల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త :వీటి గురించి ప్రజలకు అవగాహ అనంతపురము రూరల్ మండల గ్రామ పంచాయతీ లో ని బిపి ఎస్, ఎల్ఆర్ఎస్ ల పై వివరాలు సేకరించి ఆ నివేదికలను అందించి వీటి గురించి ప్రజలకు అవగాహన పంచాయతీ కార్యదర్శులకు పరిషత్ అభివృద్ధి అధికారి పి.దివాకర్, డిప్యూటీ ఎంపిడిఓ,వెంకట నాయుడు తెలియజేశారు. గురువారం కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బిపి ఎస్, ఎలార్ఎసులపై వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రూరల్ మండలంలోని గ్రామాలలో ని బిపి ఎస్, ఎల్ఆర్ఎస్ల పై కార్యదర్శులు దృష్టి పెట్టి వాటి వివరాలను సేకరించి ఆ నివేదికలను సకాల ంలో అందించాలన్నారు. మండలములోని రాజీవ్ కాలనీమరి యుఎ. నారాయణపురం గ్రామ పంచాయితీ నందలి నిర్మాణం లో ఉన్న బహుళ అంతస్తు భవనములు మరియు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణము పూర్తి చేసుకున్న భవనము లు తనిఖీ చేసి ప్రస్తుతము అమలు లో ఉన్న బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్,బి. పి.ఎస్ మరియు లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్,ఎల్.ఆర్.ఎస్,గురించి అవగాహన కల్పించడం జరిగిందని ఎల్.ఆర్.ఎస్ కొరకు 23 జనవరి 2026 మరియు బి.పి.ఎస్. కొరకు 30 మార్చి 2026 చివరి తేదీ అని, చివరి తేదీ లోపు ప్రభుత్వం వారు ఇచ్చిన ఈ సదవకాశంను వినియోగించుకోవాలని లేని యడల శాఖాపరమైన చర్యలు తీసుకోబడునని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హిదయాతుల్లా, సర్దార్ వలి, నరేంద్ర, మల్లికార్జున, పవన్ కుమార్, దివాకర్,రాఘవేంద్ర రఘురాం పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం.

## ఏ ఏ బ్యాక్టీరియాతో బాధపడుతున్న ఉప్పర రమేష్ కు ఆర్థిక సహాయం

అనంతపురం రూరల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త :


ఉప్పర రమేష్ కు ఆర్థిక సహాయం అందిస్తున్న సర్పంచ్ ఆంజనేయులు యాదవ్

ఉప్పర రమేష్ ఏ ఏ బాక్టీరియా వైరస్,తోబాధపడు తున్నాడని,కిడ్నీ ఆపరేషన్ గురి ంచి తెలుసుకుని స్వచ్ఛం దంగా ముందుకు వచ్చి కిడ్నీ ఆపరేషన్ కోసం తన వంతుగా 10000/ ఆర్థిక సహాయంను అందించిన రాచానపల్లి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు యాదవ్, నా గురించి తెలుసుకున్న రాచానపల్లి సర్పంచ్ అంజినేయులు యాదవ్ (బండ ) ఆర్థిక సహాయం అందించినందుకు అయనకు హృదయ పూర్వక ధన్యవాదములు తెలియ జేయడం జరుగుతుందని ఉప్పర రమేష్ తెలిపారు.

## అనంతలో అట్టహాసంగా సిపిఐ శత వార్షికోత్సవ ఉత్సవాలు

**( మొదటి పేజీ తరువాయి )** అన్నారు. నరేంద్ర మోడీ , చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఆస్తులను ఆదాని అంబానీలకు దారాదత్తం చేయడానికి పూనుకున్నారన్నారు. విద్య , వైద్యం , ప్రాజెక్టులు సైతం కార్పొరేట్ శక్తుల కు అమ్ముకోవడానికి ఏర్పాట్లు చేశారని గుర్తు చేశారు. దేశం ప్రమాదంలో పడుతుందని, హిందూ , ముస్లిం, క్రైస్తవులకు తగాదాలు పెట్టి అల్లర్లు సృష్టిస్తున్న భారతీయ జనతా పార్టీకి అధికారంలో కొనసాగే హక్కు లేదన్నా రు . 1964లో చీలిపోయిన సిపిఐ పార్టీ ఆ తర్వాత మరింత బలహీన పడిందని గుర్తు చేస్తూ రాబోవు రోజుల్లో వామపక్ష పార్టీలన్నీ పునరేకికరణ కావాలని బలంగా కోరుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తెలుగుదేశం, వైసీపీ, జనసేన పార్టీలకు ప్రత్యామ్నా యంగా రాజకీయ వేదిక ఏర్పాటుకు కమ్యూనిస్టు పార్టీ చొరవ చూపిస్తుందని రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య వెల్లడించారు. చంద్రబాబు, జగన్మోహన్ రెడ్డి పవన్ కళ్యాణ్ ముగ్గురూ ముగ్గురేనని రాష్ట్ర ప్రజల బాగోగులు వారికి పట్టవని భారతీయ జనతా పార్టీతో ఒప్పందాలతో ముందుకు సాగుతున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ అనేక ఉద్యమాలు చేసిన ఫలితంగానే ప్రజలకు ఫలాలు అందాయని గుర్తు చేశారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ అజెండాను రాబోవు రోజుల్లో గ్రామ గ్రామానికి తీసుకెళ్లాల్సిన ఆవశ్యకతను గుర్తు చేశారు .రాష్ట్రంలో విద్య , వైద్యం , ప్రైవేటుపరం చేయడానికి చంద్రబాబు కుట్ర చేశారని దీన్ని తిప్పి కొట్టాలన్నా రు. నిరుద్యోగం పెరిగిపో తుందని ప్రతిరోజు 39 మంది రైతులు సగటున ఆత్మహత్యలకు పాల్పడుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఏర్పాటు కోసం సిపిఐ ముందుండి నడిపిస్తుందని ఇందుకోసం బడుగు బలహీన వర్గాలు, వామపక్ష భావజాలంతో కలిగిన పార్టీలన్నీ ఏకం కావాలని ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ, అనంతపురం జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి కోసం అతిరథ మహారథులు ఉదయించి సూర్య కాంతి వెలుగును భారతదేశమంతా వ్యాపింప జేశారని, మహానుభావుల ఉద్యమాల బాటలో మనం పయనించాల్సిన అవసరమాస న్నమైందన్నారు. వారు అస్తమించినా వారి ఆశయాలు జీవించే ఉన్నాయని, నిరంతరం వారు పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం, భూమికోసం ఉన్నత వర్గాలను ఎదిరించి అనేక పోరాటాలు చేసి అశువులు బాశారని, వారిని స్మరించుకుంటూ వారి కుటుంబాలను గౌరవించడం ఆనందంగా ఉందన్నారు దాదాపు 250 మంది భారత కమ్యూనిస్టు పార్టీ అమరవీరుల కుటుంబాలను శతాబ్ద ఉత్సవాలకు ఆహ్వానించి సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె.రామ కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, రాష్ట్ర కార్యవర్గం సభ్యులు సి.జాఫర్,జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు సి.మల్లికార్జున, జె.రాజారెడ్డి తది తరులు అమరవీరుల కుటుంబాలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి. సంజీవప్ప, బి.కేశవరెడ్డి, పి.రామకృష్ణ, జి.గోపాల్ ఎన్.శ్రీరాములు, తలారి నారాయణస్వామి, ఏ.ప ద్మావతి, స్వాతంత్ర్య సమరయోధులు పెద్ద వడుగూరు సూర్యనారాయణ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, సి. లింగమయ్య తలా రి రంగ య్య, బి.రమణయ్య, శ్రీశైలం రాజేష్ గౌడ్,నాగార్జున, ఈ.కుళ్లాయిస్వామి, కె.సంతోష్ కుమార్,మల్లి కార్జున,మేకల రమేష్, చెన్నప్ప యాదవ్,పెద్దయ్య, జి. చిరంజీవి, పార్వతీ ప్రసాద్,సిపిఐ నగర సహాయ కార్యదర్శి కృష్ణుడు, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి నరేష్,బి.కె. ఎస్మండల కార్యదర్శి బండి రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు హనుమంతు, మంజునాథ్, ఉమా మహేష్, చందు వంశీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ధర్మవరంలో మహాకాలభైరవాష్టమి వేడుకలు

### - భారీ స్థాయిలో ఏర్పాట్లు.. వేలాది మందికి అన్నదానానికి శ్రీకారం
### - మూడు రోజుల పాటు సాగనున్న పూజలు

అనంతపురం, డిసెంబర్ 11 ప్రభాతవార్త బ్యూరో

శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని లక్ష్మీ చక్రవర్తి థియేటర్ ఎదురుగా శ్రీ కాలభైరవస్వామి ఆలయంలో శుక్రవారం మహాకాలభైరవాష్టమి వేడుకలు జరగనున్నాయి. కాశీక్షేత్రంలో క్షేత్రపాలకుడిగా సాక్షాత్తు శివుడే కాలభైరవు డుడిగా వెలిశారు. కాలభైరవ స్వామికి ప్రీతికరమైన, విశేషమైన రోజు కాలభైరవాష్టమి. మార్గశిర మాసంలోని బహుళ అష్టమి కాలభైరవాష్టమి. పరమ శివుడి వల్ల కాలభైరవుడు ఆవిర్భవించిన రోజే కాలభైరవాష్టమి. ఈ నేపథ్యంలో శుక్రవారం రోజు మహాకాలభైరవాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు పూజారి ధనుంజయ ఆచారి తెలిపారు. ఉదయం 5గంటలకు సుగంధ ద్రవ్యాలచే స్వామి వారికి అభిషేకం, అఖండ దివ్య జ్యోతి ప్రవేశం, మహ మంగళహారతి, మధ్యాహ్నం 12గంటలకు వేలాది మందికి అన్నప్రసాద వితరణ జరగనుంది. సాయంత్రం రుద్ర భైరవ అలంకార దర్శనం ఉంటుంది. ఏడా దిలో ఒక్కసారి మాత్రమే స్వామి వారు రుద్రభైరవ అలంకారంలో దర్శనమివ్వనున్నారు. సాయంత్రం పూజల తర్వాత వివిధ రకాల సంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఈనెల 13న సాయంత్రం స్వామి వారి గ్రామోత్స వం ఉంటు ంది. ఈనెల 14వ తేది రుద్రభైరవ అలంకారం చివరి దర్శనం ఉంటుందని పూజారి ధనుంజయ్ ఆచారి తెలిపారు.


మహాకాల భైరవ స్వామి మూల విరాట్

## రాచాన పల్లి పంచాయితీ అభివృద్ధికి కృషి చేస్తా.

### - ఇన్చార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సర్దా ర్ వలి


ఇంచార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సర్దార్ వలి.

అనంతపురం రూరల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం రాచా నపల్లి పంచాయితీని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచనలు సలహాలను పాటిస్తూసర్పంచ్,ఎంపిటిసిలు, టిడిపి, వైసిపి నాయకులు, సచివాలయసిబ్బంది,పంచాయితీకార్మికులను సమన్వయం చేసుకుని పంచాయితీ అభివృద్ధికి కృషి చేస్తానని ఇన్చార్జ్ పంచాయితీ కార్యదర్శి సర్దార్ వలి తెలిపారు. రాచా నపల్లి పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న మహమ్మద్ రఫీ పదవి ఉన్నత పొంది బదిలీ కావడంతో ఆ పంచాయితీకి ఇన్చార్జ్ కార్యదర్శిగా పి.సర్దార్ వలి ని ఎంపిడిఓ దివాకర్ నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన ఉత్తర్వుల మేరకు గురువారం పి.సర్దార్ వలి ఇన్చార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన పి.సర్దార్ వలి కి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు యాదవ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్దార్ వలి మాట్లాడుతూ రాచా నపల్లి పంచాయితీని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచనలు సలహాలను పాటిస్తూ గ్రామ సర్పంచ్, ఎంపిటిసిలు, టిడిపి, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది. పంచాయితీ కార్మికులను సమన్వయం చేసుకుని పంచాయితీ అభివృద్ధికి కృషి చేస్తానన్ని తెలియజేశారు. అనంతరం ఆయన సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులతో సమావేశమై గ్రామంలో ప్రభుత్వం నిర్దేశిం చిన సర్వేలు ఏవే గాని పెండింగ్ ఉండకుండా సకాలంలో పూర్తిచే యాలని సచివాలయ సిబ్బందికి తెలియజేశారు. అదేవిధంగా గ్రామంలో ఎక్క డే గాని చెత్త నిలువ ఉండ కుం డా ప్రతిరోజు గ్రామంలో నివ సించే ప్రజల ఇంటి వద్దకు వెళ్లి వారి నుంచి తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి సేకరించిన చెత్తను చెత్త నుంచి సంపద సృష్టి ంచే కేంద్రానికి తరలించి గ్రామాన్ని పరిశుభ్ర గ్రామంగా ఉంచాలని పంచా యతీ కార్మికులకు గ్రామ సర్పంచ్ ఆంజనేయులు యాదవ్, కార్యదర్శి సర్దార్ వలి తెలిపారు. అనంతరం ఆయన గ్రామంలోని చెత్త నుంచి సంపద సృష్టిం చే కేంద్రానికి వెళ్లి గ్రామ ప్రజల నుంచి సేకరించిన తడి పొడి చెత్తను ఏ విధంగా నిలువ ఉంచుతున్నారని దానిపై పంచాయతీ కార్మికులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## కళాకారుడు హుసేన్‌ఫీర మృతి బాధాకరం

### - శ్రీ శిరిడి సాయిబాబా నాటక కళాసమితి ఘననివాళి

పామిడి, డిసెంబర్ 11 ప్రభాతవార్త

మండల పరిదిలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన శ్రీ శిరిడి సాయిబాబా నాటక కళాసమితి సీనియర్ కళాకారుడు హుసేన్‌ఫీర (76) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీ శిరిడి సాయిబాబా నాటక కళాసమితి అధ్యక్షులు సి.వెంకట్రామిరెడ్డి(దేవుడు), ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నాగరాజు పామిడిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, క్లారినెట్ మాణిక్యం, తబలా వెంకటేష్, హార్మోనిస్టు సుంకన్న ఇతర కళాకారులంతా గ్రామానికి చేరకుని హుసేన్‌ఫీర మృతదేహాన్ని సందర్శించి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కళలే ఊపిరిగా భావిం చి కళాకారుడిగా 40 ఏళ్ల అనుభవాన్ని ఘడించిన హుసేన్‌ఫీర అర్జునుడు, సత్యహరిశ్చం ద్ర, అశ్వరామ, ద్రోణుడు పాత్రాలకు జీవం పోశాడని తెలిపా రు. గుత్తి, పెద్దవడుగూరు, పామిడి కళాకారులను చేరదీసి కష్టనష్టాలను సైతం ఓర్చుకు ని శ్రమను లెక్క చేయకుండా దాదాపు 200 పౌరాణిక నాటక ప్రదర్శనలతో కళాకారుల్లో ఉత్సాహాన్ని నింపిన ఆయన శ్రీ శిరిడి సాయిబాబా నాటక కళాసమితికి ఎనలేని సేవలందించి తనదైన శైలిలో గుర్తింపు పొందా డని తెలియజేశారు. హుసేన్‌ఫీర ప్రోత్సాహంతో సంతోషంగా జీవిస్తున్న వృతి కళాకారులు, ఔత్సాహిక కళాకారులు నాటక ప్రదర్శనలు కల్పించే నాథుడు అస్త మి ంచాడంటూ దిగ్భ్రాంతి చెందుతున్నారు. ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని మేమంతా అండగా ఉంటామని మృతుని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.


హుసేన్‌ఫీర మృతదేహానికి నివాళి అర్పిస్తున్న కళాకారులు.


హుసేన్ ఫీర (ఫైల్ ఫోటో)

## పిఆర్‌టియు ఎపి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా టి.చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నిక - అనంతపురం పిఆర్‌టియు జిల్లా శాఖ హర్షం

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 11 ప్రభాతవార్త


టి.చంద్రశేఖర్‌రెడ్డి

పిఆర్‌టియు ఎపి రాష్ట్ర ఉపా ధ్యక్షులుగా టి.చంద్రశేఖ ర్‌రెడ్డికి రాష్ట్రశాఖ ఎన్నిక చేయ డం పట్ల పిఆర్‌టియు ఎపి అనంతపురం జిల్లా అధ్యక్షులు ఎన్.విష్ణు వర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిమ్మారెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2006లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పిఆర్‌టియు సంఘ బాధ్యతలు చేపట్టి ఇప్పటి వరకు సంఘంలో వివిధ స్థాయిలలో చురుకుగా పని చేస్తున్నారు. పని చేస్తున్నారు. ఈ సంవత్సరం జరిగిన బదిలీలలో అనంతపురం పట్టణంకు బదిలీపై వచ్చే దాకా సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తూ ఉన్నారు. ఇప్పుడు బదిలీపై రావడం వలన రాష్ట్రశాఖ వీరి సేవలు గుర్తించి రాష్ట్రకార్యవర్గంలో స్థానం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు నేయకులు ఎన్.రజినీకాంత్‌రెడ్డి, ఇ.శ్రీరాములు, డి.మధుసూధన్‌రెడ్డి, ఎస్.ఎన్.రంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్‌రావు, లక్ష్మినారాయణ, రంగస్వామి, రాజశేఖర్, డి.బాబయ్య, రంగధామరెడ్డి, చిదంబర్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## కమ్మూరులో మలేరియా నియంత్రణ పైచర్యలు

కూడేరు, డిసెంబర్ 11 ప్రభాతవార్త


గ్రామంలో రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మండల పరిధిలోని కమ్మూరు గ్రామంలో మలేరియా జ్వరము కొంతమందికి నిర్ధారణ కావడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది అనంతపురం మలేరియా సబ్ యూనిట్ అధికారులు గ్రామంలో గురువారం పర్యటించారు. మలేరియా నివారణకు చర్యలు చేపట్టారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మలేరియా జ్వరం నమోదైన ప్రాంతంలో ప్రతి ఇంటిని పర్యవేక్షించి రక్తపరీక్షలు నిర్వహించారు. సుమారు 250 మంది నుండి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్ కు పంపించడం జరిగిందని వైద్య అధికారులు తెలిపారు. ఫీవర్ సర్వే, లార్వాల్ సర్వే చేయించారు. లార్వా ఆపరేషన్, ఇండోర్ స్పేస్ స్ప్రే, మీలాతీయన్ డబ్ల్యు డిపి,ఇండోర్ రెసిడ్యూయల్ స్ప్రేయింగ్ చర్యలు చేపట్టారు. సర్పంచ్, సచివాలయ కార్యదర్శి సహకారంతో సాయంకాలం ఫాగింగ్ నియంత్రణ చర్యలు చేపట్టడం జరుగుతుందని మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ సూపర్వైజర్లు నూరు భాష, శ్రీధర్ మూర్తి, కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య పర్యవేక్షకులు రవీంద్ర, మహిళా పర్యవేక్షకురాలు యశోద, సచివాలయం కార్యదర్శి హరినాథ్, హెల్త్ అసిస్టెంట్లు రవీంద్ర, శివప్రసాద్ ఆరోగ్య కార్యదర్శులు లక్ష్మి, వెంకటలక్ష్మి, వసుంధర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

బుక్కరాయసముద్రం డిశంబర్ 11 ప్రభాతవార్త


మాట్లడుతున్న ఇన్‌చార్జి ఎంపిడిఓ సదాశివా

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపిడిఓ సదాశివా అన్నారు. గురువారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమం పై మండల స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఇందిరాప్రియదర్శిని,తేహరున్నిస మాట్లడుతూ మండల వ్యాప్తంగా ఈ నెల 21,22,23 తేదిల్లో 0-5 సంవత్సరంలోపు పిల్లలందరికి పల్స్ పోలియోచుక్కలు వేస్తారు నేషనల్ ఇమ్యూనైజేషన్ డే 2025 లో భాగంగా 21వ తేది నిర్దేశించిన పోలియో బూత్ కేంద్రం నందు పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించాలని 22,23 తేదీల్లో ఇంటింటికి వెళ్లి మొదటి రోజు పోలియో చుక్కలు పొందని పిల్లలను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేయడం జరుగుతుంది. మండల వ్యాప్తంగా 7367 మంది 5 సంవత్సరంలోపు పిల్లలు ఉన్నారని వారందరికి 100 శాతం లక్ష్యాలు సాదించుటకు మండల స్థాయి అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఇఓ లింగానాయక్,సిహెచ్ఓలు మోహన్‌రావు,మోహన్‌బాబు,ఐసిడియస్ సూపర్ వైజర్స్ ధనలక్ష్మి,కౌసల్య, హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ తదితిరులు పాల్గొన్నారు.

## కంటి జబ్బులను నిర్లక్ష్యం చేస్తే జీవితం చీకటి మయం

బుక్కరాయసముద్రం డిశంబర్ 11 ప్రభాతవార్త


విద్యార్తులకు కంటిపరీక్షలపై అవగాహన కల్పిస్తూన్న వైద్యసిబ్బంది

కంటి జబ్బులను నిర్లక్ష్యం చేస్తే జీవితం చీకటి మయం అవుతుందని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ పర్వీన్ అన్నారు. గురువారం బుక్కరాయ సముద్రం మండల పరిదిలోని కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,కెకె అగ్రహారం, చెన్నంపల్లి గ్రామాల్లోన్ని ఎంపియుపి స్కూల్‌నందు రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమం లో భాగంగా ఉచిత కంటి పరీక్షల పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆప్తాల్మాలజిస్ట్ అధికారి హరిప్రసాద్ మాట్లడుతూ విద్యార్తులకు కంటి లోపాలు ఏమైనా ఉంటే పరిక్షలు నిర్వహించి ఒక వేళ అద్దాలకు అర్హులయినా వారికి పరీక్షించి కంటి అద్దాలను ఇవ్వడం జరుగుతందన్నారు.దృష్టిలోపం ఉన్నట్లు గుర్తిస్తే వారికి కంటి అద్దాలకోసం జిల్లా అందత్వ నివారణ సంగం వారికి పంపడం జరుగుతందన్నారు.లోపాలు ఉన్నావారు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు.కె.కె అగ్రహారం పాఠశాల్లో 145,చెన్నంపల్లి పాఠశాల్లో 120 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది మల్లేశ్వరి,మహేశ్వరి,లలిత తోపాటు ఆశా వర్కర్లు తదితిరులు పాల్గొన్నారు.

## పల్స్ ఫోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం..! ఎంపిడిఓ లక్ష్మినరసింహ

ఆత్మకూరు డిసెంబర్ 11 ప్రభాతవార్త

చిన్న పిల్లలు ఫోలియో బారిన పడకుండా ప్రభుత్వం ప్రతిష్మాకంగా చేపట్టుతున్న పల్స్ ఫోలియో కార్యక్రమంను విజయవంతం చేయాలని మండల అధికారులకు,ఆరోగ్య సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఓ లక్ష్మినరసింహ,ప్రభుత్వ వైద్యురాలు సబిహ్ సుల్తానా మాట్లాడుతూ ఈ నెల 21వ,తేదిన ప్రభుత్వం పల్స్ ఫోలియో కార్యక్రమం చేపట్టిందని,మండల వ్యాప్తంగా 34 కేంద్రాలును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.5 సంవత్సరాలు లోపు పిల్లలకు పల్స్ ఫోలియో చుక్కలు వేయడం జరుగుందని తెలిపారు.పిల్లలు ఫోలియో బారిన పడకుండా చూడడానికి పల్స్ ఫోలియో చుక్కలు ముఖ్యమైనదని,కావున ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు ఫోలియో చుక్కలు వేయించుకోవాని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ నరసింహారెడ్డి,రామాంజినేయులు,ఐసిడిఎస్ సూపర్వైజర్ లావణ్య,హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అనంతపురం నగరంలో గురువారం రాత్రి పాత్రికేయుతో కలిసి అఖండ 2 సినిమా ను చూసిన మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, శింగనమల ఎంఎల్ఏ బండారు శ్రావణి, తదితర తెలుగుతేశం నాయకులు



## వాజ్‌పేయి జీవితం అందరికీ స్ఫూర్తి దాయకం

### - టిడిపి జిల్లా మాజీ లీగల్ సెల్ కార్యవర్గ సభ్యులు యాటా వెంకట సుబ్బన్న


వాజ్‌పేయి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం


బిజెపి నేతలతో యాటా వెంకట సుబ్బన్న

శింగనమల, డిసెంబర్ 11 ప్రభాతవార్త

రాజకీయ నైతిక విలువలకు భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నిలువెత్తు నిదర్శనమని టిడిపి జిల్లా మాజీ లీగల్ సెల్ కార్యవర్గ సభ్యులు యాటా వెంకట సుబ్బన్న పేర్కొన్నారు. గురువారం ధర్మవరం పట్టణంలో అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన బిజెపి నేతలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన వార్త ప్రతినిధితో మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి సాదించిందని, నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పాలన ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ పాలనతో దేశంలో సుపరిపాలన కొనసాగుతోందని కొనియాడారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

## ఉత్సవ ప్రాంగణంలో సిపిఐ నాయకులు

శింగనమల, డిసెంబర్ 11 ప్రభాతవార్త


ఉత్సవాల ప్రాంగణంలో సిపిఐ నేతలు

సిపిఐ శత జయంతి ఉత్సవాల్లో శింగనమల సిపిఐ నేతలు జిల్లా కేంద్రంలలోని లలిత కళాపరిషత్‌లో జరుగుతున్న సిపిఐ శత జయంతి ఉత్స వాల కార్యక్రమంలో గురువారం సిపిఐ మండల కార్యదర్శి మధు యాదవ్, సహాయ కార్యదర్శులు చేనేత మధు, చికెన్ బాషా ఆధ్వర్యంలో శింగనమల మండలం నుంచి వంద మందికిపైగా సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మధు యాదవ్ మాట్లాడుతూ.. డిసెంబర్ 26వ తేదికి భారత కమ్యునిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని, దేశంలో బడుగు బలహీన వర్గాల కోసం ఆనాటి నుంచి నేటి వరకు పోరాడిన పార్టీ భారత కమ్యునిస్టు పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు చంద్రశేఖర్, భయన్న, మునిస్వామి, ఓబుళపతి, రామసుబ్బారెడ్డి, అజయ్, ఆదినారాయణ, మసూద్‌వలి, నాగరాజు, బెడ్డన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్.. తృటిలో తప్పిన ప్రమాదం

శింగనమల, డిసెంబర్ 11 ప్రభాతవార్త



కాలిపోయిన స్విచ్‌బోర్డు ఇన్వర్టర్

మండల పరిధిలోని నిదనవాడ గ్రామంలో రైతు శేషారెడ్డి ఇంటిలో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. కుటుంబ సభ్యు లు తెలిపిన వివరాల మేరకు.. బుధ వారం రాత్రి అందరూ ఇంటిలో నిద్రి స్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పెద్దగా వెలుతురు కనిపించడంతో అప్రమత్తమై నిద్రిస్తున్న పిల్లలను బయటకు తీసుకుని వచ్చినట్లు తృటిలో ప్రమాదం తప్పిందని రైతు శేషారెడ్డి తెలిపారు. దాదాపు 60వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు.

## ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

శింగనమల, డిసెంబర్ 11 ప్రభాతవార్త

మండల పరిధిలోని శివపురం పెద్దమ్మ తల్లి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శివపురం పెద్దమ్మ తల్లి ఆలయ నిర్వాహణ అధికారి రంగస్వామి నాయుడు తెలిపారు. కమిషనర్ దేవాదాయ శాఖ విజయవాడ వారి ఉత్తర్వుల మేరకు ధర్మకర్తల మండలి నియామకం కోసం ఫారం-1ను పూర్తి చేసి నేరుగా జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయంలో 20 రోజుల్లోపు దరఖాస్తు ఇవ్వాలని ఆసక్తిగల సభ్యులు ధర్మకర్తల మండలికి ఏర్పాటు చేసుకోవడానికి దరఖాస్తులు పంపాలని వారు కోరారు.

## పదవ తరగతి వందరోజుల ప్రణాళిక, స్టడీ మెటీరియల్ విడుదల

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 11 ప్రభాతవార్త


మెటీరియల్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

పదవ తరగతి విద్యార్థుల కోసం ఎస్‌సిఆర్‌టి బృందంచే ప్రత్యేకంగా తయారు చేయబడిన వందరోజుల ప్రణాళిక మరియు స్టడీ మెటీరి యల్‌ను అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కాపీల ను లీప్ యాప్‌లో ఉపాధ్యాయుల లాగిన్‌లో పొందు పరిచారు. వీటిని సక్రమంగా వినియోగించుకొని పదవ తరగతి విద్యార్థులలో 100 ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు, డిసిఇబి సెక్రటరీ గంధమనేని శ్రీనివాసులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్పోర్ట్స్ మీట్


కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఏజిఎం సుబ్బారెడ్డి

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 11 ప్రభాతవార్త

శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏ.టి.పి 8 బ్రాంచ్‌లో ఏ.జి ఎం సుబ్బారెడ్డి స్పోర్ట్స్ మీట్‌కు హాజరై లైటింగ్ లాంప్ వెలిగించి క్రీడలు ప్రారంభించారు. క్రీడలు శారీరక దారు ఢ్యన్ని మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని తెలియజేశారు. ప్రిన్సి పాల్ నేత్రావతి హై స్కూల్ కోఆర్డినేటర్ నాగభూషణం, డీన్ సుప్రజ, ప్రయమరీ కోఆర్డినేటర్ పూజ, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ సబిత, పి.ఈ.టిలు శివ ప్రకాష్, సుహాసిని ఉపాధ్యాయులు క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సీఆర్టిఫికెట్లు బహుకరించారు. స్పోర్ట్స్ మీట్ సందర్భ ంగా విద్యార్థులు నృత్యప్రదర్శనలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ నేత్రావతి మాట్లాడుతూ.. క్రీడలలో డిస్ట్రిక్ స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయికి వెళ్లాలని మన పదవ తరగతి విద్యార్థిని ధార మోహన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు


## MADAKASIRA NAGARA PANCHAYAT

| | | |
|---|---|---|
| ULD Name | : | Madakasira |
| Address | : | Commissioner, Madakasira Nagar Panchayat |
| Telephone No | : | 9515108814 |
| Emaild id | : | mdksnagarapanchayat@gmail.com |

| | | |
|---|---|---|
| E- Tender | 1.Water Works, Street lighting<br>2. Roads, Drains | 1. General Funds 8 No's : 38.45 Lakhs<br>2. 15th FC 5 No's : 28.89 Lakhs |
| Tender Notification No | 165/2024/E1, Dated : 11.12.2025 | |
| E-Tender Download Start, Date and Time | 12.12.2025 5.00 PM | |
| Bid Submission end Date and Time | 30.12.2025 10.30 AM | |
| E-Tender Website | https://www.apeprocurement.gov.in | |
| E-Mail ID for Clarifications/ Communication | mdksnagaraanchayat@gmail.com | |

The details of Name of the work, Tender Document,Eligibility Criteria, Bid submission & Price Bid opening date and E.M.D. details etc., may be seen on e-procurement place available @ ***www.apeprocurement.gov.in***

**sd/- Commissioner, Madakasira Nagara Panchayat**

